షాబాద్‌లో జరిగిన రైతు ధర్నాను ఉద్దేశించి ప్రసంగిస్తున్న కేటీఆర్. చిత్రంలో సబితా ఇంద్రారెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పట్నం నరేందర్‌రెడ్డి, ఆనంద్, అంజయ్యయాదవ్, మహేశ్‌రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, క్యామ మల్లేశ్, కార్తీక్‌రెడ్డి, కేటీఆర్ ర్యాలీపై గులాబీ పూల వర్షం కురిపిస్తున్న కార్యకర్తలు

గ్యారెంటీలపై గల్లా పడదాం

మొదటిపేజీ తరువాయి...

కూట్లో రాయి తీయనోడు ఏట్లో రాయి తీస్తనని చెప్తే తెలంగాణలో నమ్మేవాళ్లేవరూ లేరు' అని దెప్పిపొడిచారు. 'కేసీఆర్ పాలనలో నాట్లు వేసేటప్పుడే రైతుబంధు పైసలు పడితే.. కాంగ్రెస్ పాలనలో ఓట్లప్పుడే పడతయి' అంటూ నిష్ఠూరమాడారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల కేంద్రంలో నిర్వహించిన రైతుధర్నాకు కేటీఆర్, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, పటోళ్ల కార్తీక్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ అధికారంలోకి రాగానే రూ.2 లక్షల రుణమాఫీ, ఎకరాకు రూ.15 వేల రైతుభరోసా ఇస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు నిస్సిగ్గుగా మాటలు మారుస్తున్నాడని దుయ్యబట్టారు.

రుణమాఫీపై నిరూపిస్తే రాజకీయ సన్యాసం

రైతులందరికీ రుణమాఫీ చేశామని సీఎం, మంత్రులు అంతా అబద్ధాలు చెప్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. రాష్ట్రంలోని ఏ ఊరిలోనైనా రైతులందరి రుణాలు మాఫీ అయినట్టు నిరూపిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని, బీఆర్ఎస్ ఎమ్మెల్యేందరితో రాజీనామా చేయిస్తానని సవాల్ విసిరారు. కాంగ్రెస్ నేతలు తన సవాల్‌ను స్వీకరించాలని, లేదంటే రైతులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఏడాదిలో కాంగ్రెస్ సర్కారు చేసిన మోసాలను చూసి అన్ని వర్గాలు భగ్గుమంటున్నాయని నిప్పులు చెరిగారు. రెండు వేల పింఛన్లు 4వేలు చేస్తనని ముసలోళ్లను కూడా మోసం చేసిన ఘనుడు రేవంత్‌రెడ్డి అని విమర్శించారు. మూడు పంటలకు రైతుభరోసా ఇస్తామని చెప్పి ఉన్నది కూడా ఎగ్గొట్టారని విరుచుకుపడ్డారు.



రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో జరిగిన రైతు ధర్నాకు హాజరైన రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు

ఎకరం ఉన్న రైతుకు 17500 బాకీ

రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు చెప్పిన ప్రకారం ఏడాదికి రూ.15 వేల రైతుభరోసా, యాసంగికి ఎగ్గొట్టిన రూ.2500తో కలిపి మొత్తం ఎకరా ఉన్న రైతుకు రూ.17,500 బాకీ పడ్డాడని కేటీఆర్ చెప్పారు. రాష్ట్రంలోని కోటీ అరవై లక్షల మంది ఆడబిడ్డలకు మహాలక్ష్మి కింద రూ.30 వేలు, ఏడాదిలో పెండ్లి చేసుకున్న 5 లక్షల మంది ఆడబిడ్డలకు తులం బంగారం చొప్పున బాకీ పడ్డారని తెలిపారు. సర్పంచ్ ఎన్నికలప్పుడు ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను తమ బాకీ తీర్చాలని ప్రజలు నిలదీయాలని సూచించారు. మొహమాటపడి ఓటేస్తే రైతుభరోసా మాయమవుతుందని, ఉన్న ఫ్రీ బస్సు తుస్సుమంటుందని చెప్పారు. రూ.500కే గ్యాస్ సిలిండర్, ఫ్రీ

> రైతులందరికీ రుణమాఫీ చేసినమని సీఎంతో పాటు మంత్రులు కూడా అబద్ధాలు చెప్తున్నరు. సీఎం రేవంత్‌రెడ్డి సొంతూరు కొండారెడ్డిపల్లెతో పాటు రాష్ట్రంలోని ఏ ఊరిలోనైనా రైతులందరికీ రుణమాఫీ అయినట్టు నిరూపిస్తే నేను రాజకీయ సన్యాసం తీసుకుంటా.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేందరితో రాజీనామా చేయిస్తా.. కాంగ్రెస్ నేతలు నా సవాల్‌ను స్వీకరించాలి. లేదంటే రైతులకు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలి.
>
> -కేటీఆర్

కరెంట్ స్కీంలను ఇవ్వకుండా కాంగ్రెస్ సర్కార్ దగా చేసిందని, అన్న వస్త్రం కోసం పోతే ఉన్న వస్త్రం పోయిన చందంగా ప్రజల పరిస్థితి మారిందని వాపోయారు. ఓట్ల కోసం కాంగ్రెస్ తెచ్చిన అభయహస్తం.. భస్మాసుర హస్తంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు.

రాష్ట్రంలో త్వరలోనే ఉప ఎన్నికలు

రాజ్యాంగ విరుద్ధంగా పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో త్వరలోనే ఉప ఎన్నికలు రానున్నాయని కేటీఆర్ చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం మూడు నెలల్లో స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని, గత్యంతరం లేని పరిస్థితుల్లో ఎన్నికలు అనివార్యమని పేర్కొన్నారు. కేసీఆర్‌బొమ్మతో చేవెళ్లలో గెలిచిన ఎమ్మెల్యే అభివృద్ధికోసం పార్టీ మారానని చెప్పడం విడ్డూరమని మండిపడ్డారు. రానున్న ఉప ఎన్నికల్లో ఆయనకు ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు.

రైతుకు బేడీలు వేసిన వారికి ఓటుతో బుద్ధిచెప్పాలి

ఫార్మా కంపెనీలకు భూములు ఇచ్చేది లేదన్న పాపానికి లగచర్ల రైతులను ప్రభుత్వం చిత్రహింసలు పెట్టిందని కేటీఆర్ ఫైర్ అయ్యారు. అర్ధరాత్రి గిరిజన గూడేలపై దాడులు చేసి భయభ్రాంతులకు గురిచేసిందని విమర్శించారు. జైలులో గుండెపోటుతో బాధపడుతున్న రైతు హీర్యా నాయక్‌కు బేడీలు వేసి హాస్పిటల్‌కు తీసుకెళ్లడం సర్కారు దుర్మార్గానికి పరాకాష్ట అని మండిపడ్డారు. అమాయక రైతులతో పాటు కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని జైల్లో పెట్టిన కాంగ్రెస్ సర్కారుకు ఓటుతో బుద్ధిచెప్పాలని ప్రజలను కోరారు. ఉద్యమ నేపథ్యం కలిగిన బీఆర్ఎస్‌కు కేసులు, జైళ్లు కొత్తకాదని, అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేదాకా ఎట్టిపరిస్థితుల్లో కాంగ్రెస్ సర్కార్‌ను వదిలి పెట్టేది లేదని తేల్చిచెప్పారు.

అడుగడుగునా ఘన స్వాగతం

షాబాద్ రైతుధర్నాకు వచ్చిన కేటీఆర్‌కు బీఆర్ఎస్ నేత నవీన్‌రెడ్డి నాయకత్వంలో అడుగడుగునా పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. బీఆర్ఎస్ స్థానిక నాయకులు పెద్దసంఖ్యలో తరలివచ్చి కేటీఆర్‌ను సాదరంగా ఆహ్వానించారు. డప్పు చప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ వేదికవద్దకు తీసుకొచ్చారు. దారిపొడవునా జేసీబీల పైనుంచి గులాబీల వర్షం కురిపించారు.

మీ ఆయనకు 2వేల పింఛన్ ఎవరిచ్చిన్రు?

కేసీఆరే సార్..ఆయన ఉన్నప్పుడు నెలనెలా ఖాతాల పడుతుండె..రేవంత్ అచ్చినంక నాలుగు వేలు ఇస్తనని చెప్పి మోసం చేసిండు.. ఉన్న పింఛన్ పైసలు సుత సక్కగ ఇస్తలేడు. 500 గ్యాస్ ఇస్తమని చెప్పి, 900 తీసుకుంటుండ్రు. 400 బ్యాంకులో వేస్తమని చెప్పి మాటెత్తుతలేరు. నాకు నాలుగెకరాల భూమి ఉన్నది. ఇప్పటికి రైతుబంధు పైసలు పడలే. అటు రుణమాఫీ కాక, ఇటు రైతుబంధు రాక ఇబ్బంది పడుతున్నం. 4 వేలు పింఛన్ ఇస్తమని చెప్పి ఇప్పటికి ఇయ్యలేదు. కేసీఆర్ సారు ఇచ్చిన 2 వేలే ఇస్తుండ్రు. అవీ సరిగ్గ పడుత లేవు. 4 వేలు ఇస్తనన్న రేవంత్‌రెడ్డి పత్తాలేడు. ఆయన పాలన వచ్చినంక ఏం మంచిగ లేదు. రేవంత్‌రెడ్డి మాటలు విని మోసపోయినం సారూ.. ఈ సారి మాత్రం కేసీఆర్‌నే గెలిపిస్తం.. కేసీఆర్ వస్తేనే మాకు మేలు..

> అధికారంలోకి రాగానే రూ.2 లక్షల రుణమాఫీ, ఎకరాకు రూ.15 వేల రైతుభరోసా ఇస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు నిస్సిగ్గుగా మాటలు మారుస్తున్నడు. నిత్యం అబద్ధాలు చెప్తూ ప్రజలను ఏమారుస్తున్నడు. రాష్ట్రంలో ఎవరిమీదైనా చీటింగ్ కేసు పెట్టాలంటే మొదట రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీపైనే నమోదు చేయాలి.
>
> -కేటీఆర్

కాబోయే ఎమ్మెల్యే కార్తీక్‌రెడ్డి

'మీ అందరికీ సుపరిచితుడు..యువ నాయకుడు మీకు కాబోయే ఎమ్మెల్యే పటోళ్ల కార్తీక్‌రెడ్డి' అని కేటీఆర్ వేదికపై ప్రకటించారు. త్వరలో జరగనున్న ఉప ఎన్నికల్లో చేవెళ్లనుంచి తప్పకుండా విజయం సాధిస్తారని విశ్వాసం వ్యక్తంచేశారు. దీంతో సభకు హాజరైన బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజలు హర్షధ్వానాలు చేశారు. చప్పట్లు, ఈలలతో హోరెత్తించారు. 'కార్తీక్‌రెడ్డి జిందాబాద్' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. కేటీఆర్ ప్రకటనను స్వాగతిస్తూ బీఆర్ఎస్ నేత క్రిశాంక్ ఎక్స్ వేదికగా సంతోషం వ్యక్తంచేశారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ముమ్మాటికీ కార్తీక్‌రెడ్డి విజయం సాధించి ఎమ్మెల్యే అవుతారని పేర్కొన్నారు.

బస్సులేక తిప్పలు పడ్తున్నం

సార్ నా పేరు జక్కని రుక్మమ్మ. మాది లింగారెడ్డిగూడ. షాబాద్ మండలం. మా ఊరికి బస్సు లేక తిప్పలు పడ్తున్నం. మాలాంటి ముసలోళ్లు నడుచుకుంట పోవాల్నంటే చాన ఇబ్బంది అయితాంది. బస్సు వేయిండ్రని ఎంతమందికి చెప్పినా పట్టించుకుంటలేరు. కేసీఆర్ ఉన్నప్పుడే మాకు మంచిగుండె. మల్ల ఆ సారే రావాలె. నేను ఆయనకే ఓటేస్త.

- జక్కని రుక్మమ్మ, లింగారెడ్డిగూడ

బిల్డింగ్‌పైకి ఎక్కి కేటీఆర్‌కు అభివాదం చేస్తున్న యువకులు

మహిళా రైతులతో కేటీఆర్ మాటామంతీ

రైతుధర్నాకు హాజరైన కేటీఆర్ అక్కడి మహిళా రైతు చెన్నమ్మతో మాట్లాడారు. ఆమె యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం సర్కారు అమలు చేస్తున్న పథకాలపై అడిగి తెలుసుకున్నారు.

- **చెన్నమ్మా..నీకు రుణమాఫీ అయిందా?**
  నాకు బ్యాంకుల ఉన్న 54 వేల లోన్ మాఫీ కాలేదు సార్.. ఎన్నిసార్లు బ్యాంకుల చుట్టూ తిరిగినా పట్టించుకుంటలేరు..
- **ముఖ్యమంత్రి అబద్ధం చెప్తున్నడా? చెన్నమ్మనా?**
  లేదు సార్.. నాకు రుణమాఫీ కాలేదు. పంట పెట్టుబడి కూడా అందలేదు. కేసీఆర్ సారు ఉన్నప్పుడే మంచిగుండె. నిజం చెప్తున్న సార్..
- **కేసు ఎవల మీద పెడుదాం..ముఖ్యమంత్రి మీదనా? నీ మీదనా?**
  నామీద కేసెందుకు సార్..రుణమాఫీ కాదు సార్ గ్యాస్ పైసలు కూడా ఖాతాల పడ్డలేవు.. ఓట్ల కోసం అబద్ధాలు చెప్పిన ముఖ్యమంత్రి మీదనే కేసు పెట్టాలె.

రేవంత్..మీ ఢిల్లీ నేతలతో అశోక్‌నగర్‌కు రా

'తెలంగాణలో ఇచ్చిన హామీలకే దిక్కు లేదు గాని, ఇక ఢిల్లీలో గ్యారెంటీలు అమలు చేస్తావా?' అని సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్ అయ్యారు. తెలంగాణలో 420 హామీలు ఇచ్చి గంగలో కలిపి ఇప్పుడు ఢిల్లీ పురవీధుల్లో రేవంత్ కొత్త నాటకం మొదలు పెట్టారని శుక్రవారం ఎక్స్ వేదికగా విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో తామిచ్చిన హామీలను అమలు చేశామని చెప్తూ రేవంత్‌రెడ్డి ఢిల్లీ ప్రజలనూ మోసం చేయాలని కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో సాగుతున్న నికృష్ట పాలన ఢిల్లీలో కూడా చేయిస్తానని పులకేశి బయలుదేరారని ఎద్దేవాచేశారు. 'ఉచిత కరెంటు ఇచ్చింది ఎవరికి ? గ్యాస్ సబ్సిడీ ఇచ్చింది ఎవరికి ? నెలకు రూ.2500 అందుకుంటున్న మహిళలు ఎవరు? తులం బంగారం అందిన ఆడబిడ్డలు ఎవరు? రైతుభరోసా రూ.7500 ఇచ్చిందెక్కడ ? ఆసరా పింఛన్లు రూ.4000 చేసిందెక్కడ? రూ.5 లక్షల విద్యాభరోసా ఎక్కడ? విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు ఏవీ? పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా ఇక్కడ హామీలకు దిక్కులేదు గాని, ఢిల్లీ ప్రజలకు గ్యారెంటీలు ఇస్తున్నవా?' అని నిప్పులు చెరిగారు. 'ఢిల్లీ గల్లీల్లో కాదు.. మీ ఢిల్లీ పెద్దలతో కలిసి అశోక్‌నగర్ గల్లీల్లో ఉద్యోగాలు ఇచ్చామని చెప్పు' అని కేటీఆర్ సవాల్ విసిరారు.

అలీబాబా అరడజన్ దొంగల్లా రేవంత్ ముఠా

- భూదందాలు చేస్తూ కోట్లు కొల్లగొడుతున్నరు
- హేగ్డేవార్‌ను పొగిడిన రేవంత్ సిసలైన ఆరెస్సెస్‌వాది
- బెదిరింపులు, అదిరింపులకు బీఆర్ఎస్ భయపడదు
- బ్లాక్‌మెయిల్‌కు బ్రాండ్ అంబాసిడర్ రేవంత్
- మీడియాతో చిట్‌చాట్‌లో కేటీఆర్

హైదరాబాద్, జనవరి 17 (నమస్తే తెలంగాణ):ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్‌కు బ్రాండ్ అంబాసిడర్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు మండిపడ్డారు. రేవంత్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల దోపిడీముఠా రాష్ట్రంలో భూదందాలకు పాల్పడుతున్నదని ఆరోపించారు. రేవంత్ సోదరులు తిరుపతిరెడ్డి, కొండల్‌రెడ్డితోపాటు వేం నరేందర్‌రెడ్డి, ఫహీం ఖురేషీ, ఏవీరెడ్డి, రోహిన్‌రెడ్డితో కూడిన అలీబాబా అరడజన్ దొంగల గ్యాంగ్ రాష్ట్రంలో సంచరిస్తూ అనేక దురాగతాలకు దిగుతున్నదని మండిపడ్డారు. శుక్రవారం షాబాద్‌లో నిర్వహించిన రైతుధర్నాలో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు. రేవంత్ గ్యాంగ్ బ్లాక్‌మెయిల్ వ్యవహారాలను తప్పుదోవ పట్టించేందుకే రోజుకో డ్రామా తెరపైకి తెస్తున్నారని విమర్శించారు. మొదట హైడ్రా, తర్వాత మూసీ, ఆ తర్వాత అల్లు అర్జున్‌పై కేసు, ఆ తర్వాత ఫార్ములా-ఈ రేసు కేసు.. ఇలా పూటకో నాటకమాడుతున్నారని దుయ్యబట్టారు. రేవంత్ అక్రమ వ్యవహారాలు ఆ పార్టీ ఢిల్లీ పెద్దలకు తెలిసినా పట్టించుకోవడంలేదని ఆక్షేపించారు. ముఖ్యమంత్రి కంటే ముందు ఆరు గ్యారెంటీల పేరిట అబద్ధాలు చెప్పిన రాహుల్‌గాంధీ, సోనియాగాంధీని నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ కాదని, బీఆర్ఎస్ఎస్ అని ముఖ్యమంత్రి ఢిల్లీలో వ్యాఖ్యానించారంటూ ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు కేటీఆర్ స్పందిస్తూ.. హేగ్డేవార్ గురించి గొప్పలు చెప్పిన రేవంత్‌రెడ్డి నిఖార్సైన ఆరెస్సెస్ వాది అని చెప్పారు. ఆయన వేసుకున్న నెక్కర్ కూడా ఖాకీదేనని, ఈ విషయం అసదుద్దీన్ ఒవైసీ కూడా చెప్పారని గుర్తుచేశారు.

హైదరాబాద్ ఖ్యాతిని పెంచేందుకు ఫార్ములా రేసు

హైదరాబాద్ నగర ఖ్యాతిని పెంచేందుకే ఫార్ములా-ఈ రేసును తీసుకొచ్చానని కేటీఆర్ చెప్పారు. ఈ విషయంలో మంత్రిగా విధానపరమైన నిర్ణయం తీసుకొని, ఎఫ్ ఈవో కంపెనీకి రూ.55 కోట్లు చెల్లించామని తెలిపారు. ఈ వ్యవహారంలో అవినీతి ఎంతమాత్రంలేదని పునరుద్ఘాటించారు. ఏవైనా ప్రొసీజర్ ల్యాప్స్ ఉంటే ఉండొచ్చని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ఆ నగదును ఎందుకు వెనక్కి తీసుకొనిరాలేదని ప్రశ్నించారు. తనపై ప్రభుత్వం దురుద్దేశపూర్వకంగానే కేసు నమోదు చేసిందని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ కూడబలుక్కొని తనపై ఏసీబీ, ఈడీ కేసులు పెట్టించాయని ఆరోపించారు. తాను ఏసీబీ, ఈడీ అధికారులు అడిగిన ప్రశ్నలకు నిర్భయంగా, నిస్సంకోచంగా సమాధానాలు చెప్పానని వెల్లడించారు.

కరీంనగర్ జిల్లా మానకొండూర్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి పొన్నాల. చిత్రంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, కేడీసీసీబీ చైర్మన్ కొండూరు తదితరులు

ఏడాదైనా గ్యారెంటీల అమలు ఏదీ?

- పసుపు బోర్డు ఘనత బీఆర్ఎస్‌దే
- మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య

మానకొండూర్, జనవరి 17: అవగాహన లేమి, అహంకార ధోరణితో రేవంత్ సర్కార్ నడుస్తున్నదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత పొన్నాల లక్ష్మయ్య విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఆరు గ్యారెంటీలను అమలు చేయడం లేదని మండిపడ్డారు. తెలంగాణలో కేసీఆర్ ఆన వాళ్లు లేకుండా చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నించడం అతని మూర్ఖత్వానికి నిదర్శనమని అన్నారు. కేసీఆర్ అంటే ప్రజలకు అపార విశ్వాసం ఉన్నదని అన్నారు. కరీంనగర్ జిల్లా మానకొండూర్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలు, హామీలతో గద్దెనెక్కిందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలైన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందా లేదా? అని చెప్పే ధైర్యం సీఎం రేవంత్‌రెడ్డికి ఉన్నదా? అని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలు, హామీలు అమలు చేయడానికి ఎన్ని డబ్బులు అవసరమవుతాయో అసలు రేవంత్‌కు తెలుసా? అని అడిగారు. ఇచ్చిన హామీలనే ఇప్పటివరకు అమలు చేయలేదని, అదనంగా మూసీ సుందరీకరణ పనులకోసం రూ.లక్షా 50 వేల కోట్లు, రాష్ట్రంలో 24 లక్షల ఇండ్లు, ఆరేండ్లలో 20 వేల మెగావాట్ల గ్రీన్ పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం చేపడుతామని ప్రకటించారని, వీటికి నిధులెలా తెస్తారని ప్రశ్నించారు? సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారావు, కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, కరీంనగర్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి. చిత్రంలో గెల్లు, ఎర్రోళ్ల శ్రీనివాస్, గోవర్ధన్

'20రోజుల' నిబంధనతో 'ఆత్మీయ' కోతలు

- భూమిలేని పేదలకు 12 వేలు ఎగగొట్టడానికి ప్రయత్నం
- అసెంబ్లీ ఎన్నికల ముందే ఈ ఆంక్షలెందుకు చెప్పలే?
- బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి నిలదీత

హైదరాబాద్, జనవరి 17 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కారు 13 నెలల పాలనలో కోతలు, ఎగవేతలు తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో శుక్రవారం బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, పార్టీ నేతలు మన్నె గోవర్ధన్, రాంబాబు యాదవ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరుతో కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో భూమిలేని పేదలకు ఏటా రూ.12 వేల చొప్పున చెల్లిస్తామని, ఇప్పుడు 20రోజుల ఉపాధి పనిదినాల పేరిట కొర్రీలు పెడుతున్నదని విమర్శించారు. ఉపాధి జాబ్ కార్డు కలిగి, 20రోజులు పనిచేసిన వారికే ఇస్తామని నాడెందుకు చెప్పలేదని నిలదీశారు. రాష్ట్రంలో 58 లక్షలపై చిలుకు జాబ్ కార్డులు ఉన్నాయని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆ కుటుంబాల సంఖ్య 3.27 లక్షలకే మిగులుతుందని చెప్పారు.

ఆరు గ్యారెంటీలు ఎక్కడ?

- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన గిరిజన మహిళలు

చేగుంట, జనవరి 17 : 'మీరు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు ఎక్కడికి పోయినయ్? సీఎం రేవంత్ సార్ గిదేనా మీ పాలన' అంటూ మెదక్ జిల్లా నార్సింగి మండలం నర్సంపల్లి తండాలో గిరిజనులు మండిపడ్డారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు నర్సంపల్లి తండాకు రాగా, గిరిజన మహిళలు ఆయన ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో అనేక హామీలిచ్చి ఇప్పుడు అమలు చేయకుండా తమను మోసం చేసిందని వారు ఆవేదన వ్యక్తంచేశారు. 'సన్న బియ్యం ఇస్తమంటిరి, రుణమాఫీ అంటిరి, పింఛన్లు పెంచుతమంటిరి, రైతుబంధు ఇస్తలేక పోతిరి, మీరిచ్చిన హామీలు ఎక్కడ పోయినయ్' అని గిరిజన మహిళలు రేవంత్ సర్కార్‌పై మండిపడ్డారు. తాము కూరగాయలు సాగుచేస్తూ బతుకుతున్నామని, రూ.2 లక్షల రుణమాఫీ కాలేదని, రైతుబంధు వస్తలేదని అన్నారు.

మెదక్ జిల్లా నార్సింగి మండలం నర్సంపల్లి గిరిజన తండాలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఎదుట కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగడుతున్న మహిళలు

ఇది ప్రభుత్వ అక్రమ కేసు

- నా ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ ఏది?
- పోలీస్ విచారణకు హాజరైన కౌశిక్‌రెడ్డి

హైదరాబాద్ సిటీబ్యూరో/మెహిదిపట్నం, జనవరి 17 (నమస్తే తెలంగాణ): పోలీసుల విధులకు ఆటంకం కలిగించాడనే ఆరోపణపై నమోదైన కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి శుక్రవారం మాసబ్‌ట్యాంక్ ఠాణాలో విచారణకు హాజరయ్యారు. ఈ కేసు విచారణ అధికారి ఇన్‌స్పెక్టర్ పరుశురాం ఆయనను గంటకుపైగా విచారించారు. ఈ సందర్భంగా 32 ప్రశ్నలు అడిగి ఎమ్మెల్యే స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్ వద్ద కౌశిక్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తనపై ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించిందని ఆరోపించారు. తన ఫోన్ ట్యాపింగ్ జరుగుతున్నదని ఫిర్యాదు చేయడానికి డిసెంబర్ 4న బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లానని ఆయన చెప్పారు.

కరీంనగర్ రూరల్ ఏసీపీకి ఫిర్యాదు చేస్తున్న చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

ఇంటిపై దాడి.. కులం పేరుతో దూషణ

- కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోండి
- కరీంనగర్ రూరల్ ఏసీపీకి మాజీ ఎమ్మెల్యే సుంకె ఫిర్యాదు

కరీంనగర్, జనవరి 17 (నమస్తే తెలంగాణ) : తన ఇంటిపై దాడి చేసి, గూండాల్లా వ్యవహరించి, కులం పేరుతో దూషించిన కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ శుక్రవారం కరీంనగర్ రూరల్ ఏసీపీకి ఫిర్యాదు చేశారు. 'గురువారం కరీంనగర్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసంలో ప్రెస్‌మీట్ అనంతరం హైదరాబాద్ వెళ్లానని, అదేరోజు సాయంత్రం కాంగ్రెస్‌కు చెందిన 20 మంది గూండాలు, రౌడీషీటర్లు గంగాధర మండలం బూరుగుపల్లిలోని తన ఇంటిపై దాడి చేసి, దుర్భాషలాడారని, దాడిలో ఉన్న ఒడ్నాల యగ్నేష్ అనే రౌడీషీటర్ హత్య కేసులో జైలుకెళ్లి ఇటీవలే వచ్చాడని, అనిల్‌రెడ్డి, మ్యాక వినోద్ (రౌడీషీటర్), శ్రీను పటేల్, ఒడ్నాల వంశీ, రోహిత్ బిట్టు, ముత్యం శంకర్, అజయ్‌గౌడ్ తదితరులున్నారని పేర్కొన్నారు. దాడి జరిగినప్పుడు ఇంట్లో భార్య దీవెనతోపాటు బంధువులు ఉన్నారని, హైదరాబాద్ నుంచి వచ్చి శుక్రవారం ఫిర్యాదు చేసినట్టు చెప్పారు.